# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-03-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ప్రపంచ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎల్లుండి రాత్రి 8 గంటల 30 నిమిషాల నుంచి 9 గంటల 30 నిమిషాల వరకు 'ఎర్త్ అవర్' పాటించాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రజలకు పిలుపునిచ్చారు.**

**2.** **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి ఆరోగ్యం, వ్యవసాయం, విద్యా రంగాల్లో కొత్త ఆవిష్కరణలకు కృషి చేస్తామని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ పేర్కొన్నారు.**

**3.** **విజయనగరం జిల్లాలోని తోటపల్లి రిజర్వాయర్ కింద ఆయకట్టు పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టంచేశారు.**

**4.** **రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న పదవుల భర్తీకి ఈ నెల 27వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది.**

**5.** **అంతరించిపోతున్న పిచ్చుకల జాతిని కాపాడుకునే లక్ష్యంతో ఈరోజు ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పాటిస్తున్నాం.**

==========================

వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ ఎర్త్ అవర్ గ్లోబల్ ఉద్యమంలో భాగంగా, ఎల్లుండి రాత్రి 8 గంటల 30 నిమిషాల నుంచి 9 గంటల 30 నిమిషాల వరకు ఒక గంట పాటు 'ఎర్త్ అవర్' పాటించాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎర్త్ అవర్ ప్రచారం ప్రపంచవ్యాప్తంగా ఒక గంట పాటు అనవసరమైన లైట్లను స్వచ్ఛందంగా నిలిపి వేయడం ద్వారా.. వాతావరణ పరిరక్షణ ఉద్యమంలో ప్రజలను ఏకం చేస్తూ, భవిష్యత్ తరాలకు మెరుగైన ప్రపంచాన్ని అందించడంలో సహాయపడుతుందని గవర్నర్ తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందాలపై మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆరోగ్యం, వ్యవసాయం, విద్యా రంగాల్లో కొత్త ఆవిష్కరణలకు కృషి చేస్తామని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని మెరుగైన సేవలు అందించాలని ఎదురుచూస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో బిల్ గేట్స్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిన్న సమావేశమై.. రాష్ట్రానికి సంబంధించి గేట్స్ ఫౌండేషన్‌తో పలు ఒప్పందాలు చేసుకున్నారు.

-------------------------

విజయనగరం జిల్లాలోని తోటపల్లి రిజర్వాయర్ కింద ఆయకట్టు పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టంచేశారు. శాసనసభలో సభ్యుల ప్రశ్నకు ఈ రోజు ఆయన సమాధానమిస్తూ.. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న పనులు రద్దు చేసి, మళ్లీ టెండర్లు పిలుస్తామని తెలిపారు. 2018లోనే ఈ ప్రాజెక్టు ఆధునీకరణకు నిధులు కేటాయించినా ప్రభుత్వం మారిన తర్వాత పనులు మందగించాయని మంత్రి వివరిస్తూ..

**వాయిస్ (32 సెకన్లు)**

---------------------------

రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న పదవుల భర్తీకి రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. కడప జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, కర్నూలు జిల్లా పరిషత్ కో–ఆప్టెడ్ సభ్యుడు, 28 మండల పరిషత్ అధ్యక్షులు, 23 మండల ఉపాధ్యక్షులు, మండల ప్రజా పరిషత్‌లో 12 మంది కో–ఆప్షన్ సభ్యులు, 214 మంది ఉపసర్పంచుల పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. పదవుల భర్తీకి రాష్ట్ర ఎన్నికల సంఘం వేర్వేరుగా 7 నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ మేరకు నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ స్థానాలకు ఈ నెల 27వ తేదీ ఎన్నికలు జరగనున్నాయి.

---------------------------

అంతరించిపోతున్న పిచ్చుకల జాతిని కాపాడుకునే లక్ష్యంతో ఈరోజు ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పాటిస్తున్నాం. మొట్టమొదటి ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని 2010లో పాటించారు. "నేచర్ ఫరెవర్ సొసైటీ ఆఫ్ ఇండియా" ఫ్రాన్స్‌కు చెందిన "ఎకో–సిస్ యాక్షన్" ఇతర జాతీయ, అంతర్జాతీయ సంస్థల తోడ్పాటుతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోతున్న సహజ జీవవైవిధ్య జాతుల సంరక్షణ అవసరాన్ని గుర్తించి.. అందుకోసం క్రియాశీలకంగా పనిచేసేలా ప్రజలను ఏకం చేయడమే ఈ పిచ్చుకల దినోత్సవ లక్ష్యం.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా ఈ రోజు రాత్రి తిరుమలకు చేరుకుంటారు. రేపు ఆయన కుటుంబ సమేతంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారి సేవలో పాల్గొననున్నారు. అనంతరం తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రంలో భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలను వడ్డించనున్నారు. ముఖ్యమంత్రి తిరుమల పర్యటన నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది.

---------------------------

రాష్ట్రంలో సినిమా పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శాసనమండలిలో ఈ రోజు ఆయన సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తూ సినిమా పరిశ్రమకు సంబంధించి ఒక పాలసీ తీసుకురానున్నామని వెల్లడించారు. త్వరలో సినిమా నిర్మాతలు, ప్రముఖులతో సమావేశం నిర్వహిస్తామని, విశాఖపట్నంలో సినీ పరిశ్రమకు ప్రోత్సాహకాలు అందిస్తామని మంత్రి దుర్గేష్ వివరిస్తూ...

**వాయిస్ (25 సెకన్లు)**

---------------------------

రాష్ట్ర విభజన సమయానికి రాష్ట్రంలో 41 గురుకుల పాఠశాలలు ఉండేవని, 2014-18 మధ్య కాలంలో మరో 65 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ రోజు శాసనసభలో సభ్యుల ప్రశ్నలకు ఆమె సమాధానమిస్తూ.. రాష్ట్రంలో ప్రస్తుతం 108 గురుకుల పాఠశాలలు ఉండగా, 28 మాత్రమే స్వంత భవనాల్లో కొనసాగుతున్నాయని వెల్లడించారు. గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామని మంత్రి సవిత వివరిస్తూ...

**వాయిస్ ( 26 సెకన్లు )**

---------------------------

విజయవాడలోని పాస్‌పోర్ట్ సేవా కేంద్రంలో ఈ నెల 22వ తేదీన 200 అదనపు స్లాట్‌లు అందుబాటులోకి తెచ్చామని ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి కె.శివహర్ష తెలిపారు. వీటికి సంబంధించి తాజా అపాయింట్‌మెంట్లు, ఇప్పటికే ఉన్న అపాయింట్‌మెంట్ల రీషెడ్యూలింగ్‌లను పాస్‌పోర్ట్ సేవా వెబ్‌సైట్ www.passportindia.gov.in ద్వారా పొందవచ్చని ఆయన సూచించారు.

---------------------------

కొల్లేరు సమస్య జటిలం కావడానికి రాజకీయాలే కారణమని జనసేన పార్టీ పేర్కొంది. కొల్లేరు విధ్వంసంపై ఈ రోజు ఆ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. తమ పార్టీ పర్యావరణాన్ని పరిరక్షించే సిద్ధాంతాన్ని అవలంబిస్తుందని, కొల్లేరుపై ఆధారపడిన వారి ఉపాధిని, పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేసింది. జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అధికారులు, నిపుణులు, కొల్లేరు ప్రాంతవాసులతో సమావేశమై సమస్యల సమతుల్యమైన పరిష్కారం దిశగా చర్చిస్తున్నారని పేర్కొంది.

---------------------------

విశాఖపట్నం, విజయవాడ మెట్రోరైలు ప్రాజెక్టుల కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్.. సీఎంపీ కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ రెండు ప్రాజెక్టులకు ఇచ్చిన మొబిలిటీ ప్లాన్ గడువు ఐదేళ్లు దాటింది. ఈ నేపథ్యంలో మరోసారి ప్లాన్ రూపొందించాలని కేంద్ర పట్టణ రవాణా విభాగం కోరింది. కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు సీఎంపీ కోసం కన్సల్టెన్సీ సంస్థను ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్ టెండర్ల ద్వారా ఎంపిక చేసింది. ఈ మేరకు విశాఖపట్నంలో 84 లక్షల 47 వేల రూపాయలతో, విజయవాడలో 86 లక్షల 68 వేల రూపాయలతో సిస్ట్రా ఎంవీఏ సంస్థ ప్రణాళిక రూపొందించనుంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈ నెల 30వ తేది ఆదివారం ప్రసారం అవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=====================